దవాఖానాలో నీటి కరువు

- మూత్ర పరీక్షలు చేయబోమంటున్న సిబ్బంది
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పంజాగుట్ట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యాదగిరినగర్ బస్తీ దవాఖానాలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నల్లా కనెక్షన్ సైతం లేకపోవడంతో రోగులకు మూత్ర పరీక్షలు చేయడం లేదు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే ఆస్పత్రిలో బాత్‌రూమ్ లేదని, నీళ్లు లేవని దవాఖానా సిబ్బంది సమాధానమిస్తున్నారు. గత ఏడాది స్థానిక కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి దవాఖానాను, పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. వెంటనే సమస్యను పరిష్కారిస్తామని ఆ సమయంలో హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు ఆ దిశగా తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం.


నిరుపయోగంగా ఉన్న సింటెక్స్ ట్యాంక్


యాదగిరినగర్ బస్తీ దవాఖానా

ఇంటినుంచే మూత్రం పట్టుకురావాలి..

దవాఖానాకు వచ్చే రోగులు మూత్ర పరీక్ష చేయించుకోవాలంటే ఓపీ రాయించుకున్న అనంతరం డబ్బా ఇంటికి తీసుకెళ్లి మూత్రం పట్టుకుని రావాల్సిన పరిస్థితి నెలకొంది. లేదంటే యూపీహెచ్‌సీ శ్రీరాంనగర్ ఆస్పత్రికి వెళ్లి మూత్ర పరీక్ష చేయించుకోవాలి. దవాఖానాలో పనిచేసే డాక్టర్, సిబ్బందికి అత్యవసరమైనప్పుడు పక్కనే ఉండే ఇళ్లలోని బాత్‌రూమ్‌లను వినియోగించుకుంటున్నారు. దవాఖానా నుంచి పైప్ లైన్ కలపడానికి 300 మీటర్ల దూరం మాత్రమే ఉందని.. ఇంత దగ్గరలో ఉన్న తాగునీటి పైప్ లైన్ కలపడానికి అధికారులు సాకులు చెబుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్‌ను పలుమార్లు కోరినప్పటికీ పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రానిదీ ఇదే దుస్థితి..

యాదగిరినగర్ కమ్యూనిటీహాల్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి ఆరు సంవత్సరాలుగా నీళ్లు లేవు. దీంతో చిన్నారులకు మూత్ర, మల విసర్జనకు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో ఆయా ఇల్లు ఉండటంతో చిన్నారులను ఆమె తన ఇంటికి తీసుకెళ్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మూత్ర పరీక్ష చేయడం లేదు



బస్తీ దవాఖానాకు వచ్చే రోగులకు మూత్ర పరీక్ష చేయడం లేదు. ఎందుకని అడిగితే నీళ్లు లేవంటున్నారు. మూత్ర పరీక్ష కోసం యూపీహెచ్ శ్రీరాంనగర్‌కు పంపిస్తున్నారు. అంత దూరం వెళ్లాలంటే వృద్ధులకు, మహిళలకు ఇబ్బందికరంగా ఉంటుంది.

- షరీన్ బేగం, భవానీశంకర్ నగర్

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు

పంజాగుట్ట, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ఎస్సీ ఎస్టీ వర్గీకరణ రాజ్యాంగానికి, రిజర్వేషన్ల స్ఫూర్తికి విరుద్ధమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వన్ మెన్ కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేదిక ఉద్యోగ విభాగం అధ్యక్షుడు చెట్లపల్లి అరుణ్ కుమార్, అంబేద్కర్ ఉత్సవాల కమిటీ మాజీ చైర్మన్ రావుల విజయ్ కుమార్, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ మాట్లాడుతూ.. అంటరానితనంగా వచ్చిన రిజర్వేషన్లను ఆర్థిక ప్రాతిపదికకు ముడిపెట్టడం సరికాదన్నారు. ఎస్సీ, ఎస్టీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో వేదిక నాయకులు చొక్కంపేట ఆంజనేయులు, ఎం.వేణుగోపాల్, కె.రాజేష్ పాల్గొన్నారు.


జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు


అవార్డు అందుకుంటున్న శ్రీపూజ

శ్రీపూజకు జేసీఐ ఎక్సలెన్స్ పురస్కారం

బంజారాహిల్స్, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): విద్య, ఆరోగ్యం, క్లినికల్ సైకాలజీలో నిష్ణాతురాలైన డాక్టర్ శ్రీపూజ సిద్ధంశెట్టికి జేసీఐ అలుమ్ని క్లబ్ ప్రతిష్టాత్మక ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేసింది. జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ అలుమ్ని క్లబ్ (జేసీఐ) వారు సమాజాభివృద్ధికి, మానవాళికి మేలు చేసేవారికి ఈ అవార్డును అందిస్తుంటారు. జోన్ బోర్డు మెంబర్‌గా ఆమె చేసిన విశేష కృషికి ఈ గుర్తింపు లభించింది. కాగా, ఆమె ఇప్పటికే తన ప్రతిభతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో జేసీఐ జాతీయ ప్రతినిధులు సునీల్‌కుమార్ రుమల్లా, వినయ్ మెహతా, మనోజ్ ఠాకర్, జోన్ చైర్మన్ జీవీఎస్ రాజు తదితరులు పాల్గొని ఆమెకు అవార్డును అందజేశారు.


డీఆర్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పీసీబీ అధికారి ప్రసన్నకుమార్

కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హానికరమైన కాలుష్య ప్రభావాలపై యువతకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నడుం బిగించింది. ఈ మేరకు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్స్‌ను పీసీబీ నిర్వహిస్తోంది. బుధవారం డీఆర్‌ఎస్ పాఠశాల విద్యార్థులతో జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో పీసీబీ ఉన్నతాధికారులు పాల్గొని కాలుష్య పర్యవసానాలపై అవగాహన కల్పించారు. నివాస, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాలలో వాయు కాలుష్య స్థాయిలను ఫిల్టర్ పేపర్ల ద్వారా విద్యార్థులకు చూపించారు. వాయు, నీటి, శబ్ద కాలుష్యంతో పాటు పర్యావరణాన్ని ప్రభావితం చేసే వివిధ రకాల కాలుష్యాల గురించి వీడియో, ఆడియో ప్రదర్శనల ద్వారా తెలియజేశారు. పారిశ్రామిక ఉద్గారాలు, వాహనాల నుంచి వెలువడే పొగ, వ్యర్థాల తొలగింపు, అటవీ నిర్మూలన, శిలాజ ఇంధనాల దహనం వంటి కాలుష్య రకాల గురించి పీసీబీ అధికారులు వివరించారు. వాయు కాలుష్యంతో శ్వాసకోశ వ్యాధులు, అధిక శబ్దం వల్ల ఒత్తిడి, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వన్యప్రాణులపై సైతం కాలుష్యం తీవ్రమైన ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వ్యర్థాలను తగ్గించడం, రీసైక్లింగ్ చేయడం, నీరు, విద్యుత్‌ను ఆదా చేయడం, మొక్కలు నాటడం, కమ్యూనిటీలలో అవగాహన పెంపొందించడంతట కాలుష్య నివారణకు కృషి చేయవచ్చని పీసీబీ అధికారులు వెల్లడించారు.

కాలుష్య నివారణ చర్యలపై చర్చ

వ్యర్థాలను తగ్గించడం, రీసైక్లింగ్ చేయడం, నీరు, విద్యుత్‌ను ఆదా చేయడం, మొక్కలు నాటడం, కమ్యూనిటీలలో అవగాహన పెంపొందించడం ద్వారా కాలుష్య నివారణకు కృషి చేయవచ్చని పీసీబీ అధికారులు వెల్లడించారు. ఇల్లు, పాఠశాల, సమాజాన్ని పరిశుభ్రమైన, పచ్చని ప్రదేశంగా ఎలా మార్చవచ్చనే ఆలోచనలపై విద్యార్థులు, అధికారులు చర్చించారు.


రీసెర్చ్ స్కాలర్‌తో సంభాషిస్తున్న కేంద్ర మంత్రి సుకాంత్, చిత్రంలో వర్సిటీ వీసీ బీజేరావు

పరిశోధనల్లో విద్యావేత్తల కృషి అభినందనీయం

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో విద్యావేత్తల కృషి అభినందనీయమని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత్ మజుందార్ అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. కేంద్ర మంత్రికి వర్సిటీ వీసీ బీజేరావు, రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్ స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ రూపకల్పనలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమల సహకారంపై సదస్సు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు పరిశ్రమ, విద్యారంగం స్పందించాల్సిన తీరుపై చర్చిస్తూ 'పర్యావరణ పరిరక్షణలో ఉన్నత విద్య: పరిశ్రమ, విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం' అంశంపై ఓ కార్యక్రమాన్ని రాయదుర్గంలోని టీ-హబ్ వద్ద బుధవారం నిర్వహించారు. యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ (యూఈఎల్), సిమెన్స్, టీ-హబ్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూఈఎల్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ క్యాంపస్) ప్రొఫెసర్ పౌల్ మార్షల్, డైరెక్టర్ గుల్నార్ స్టోవేర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పరిశ్రమ, విద్యారంగ భాగస్వామ్యాలను నిర్మించడంలో సవాళ్లు, అవకాశాలపై చర్చించారు. దీనిలో భాగంగా సిమెన్స్‌తో యూఈఎల్ ఒప్పందం చేసుకుంది.

పాన్‌షాప్ నిర్వాహకుడిపై దాడి అవాస్తవం

- బోరబండ పోలీసులు

బోరబండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్మికనగర్ చౌరస్తాలో మెహ్రాజ్ పాన్‌షాప్ నిర్వాహకుడిపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని బోరబండ పీఎస్ పోలీసులు ఖండించారు. రాత్రి 12గంటలు దాటినా షాప్ మూయలేదని, అక్కడ గుమికూడి ఉన్న యువకులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీకి పనిచెప్పారని సీఐ చెబుతున్నారు. ఈ విషయంపై బాధితుడిని అడగ్గా తనపై ఎలాంటి దాడి జరగలేదని వెల్లడించాడు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ అమర్ సొసైటీ, మీనాక్షి ఫీడర్ల పరిధిలోని అమర్ సొసైటీ, కావూరి హిల్స్ ఫేజ్-2, ఆర్ట్ గ్యాలరీ లైన్, దుర్గం చెరువు, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10, 15, మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి ఇంటి ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కేవీ ఇందిరానగర్, దివ్య డైమండ్స్, టీవీ5 ఫీడర్ల పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-1,9, టీవీ5,దుర్గం చెరువు, ఇందిరానగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ ఈఎస్ఐ స్టాఫ్ క్వార్టర్స్, శ్రీముఖి అపార్టుమెంట్ ఫీడర్ల పరిధిలోని ప్రశాంత్ కాలనీ, బల్కంపేట ,టీకే గూడ మసీద్, ఈఎస్ఐ స్టాఫ్ క్వార్టర్స్ శ్రీముఖి అపార్టుమెంట్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కేవీ ఆర్బీఐ క్వార్టర్స్, బేగంపేట నాలా, ప్రేమ్‌నగర్ ఫీడర్ల పరిధిలోని తాతాచారి కాలనీ, బాంబే హల్వా కాంపౌండ్, పోచమ్మబస్తీ, ఆర్బీఐ క్వార్టర్స్ వాణి ప్రింటర్స్, గురుమూర్తి లైన్, ఎర్రగడ్డ, ప్రేమ్ నగర్, ఛత్రపతి శివాజీ నగర్, బ్రహ్మశంకర్ లాల్ నగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

'ఆయాలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

పంజాగుట్ట, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): మహిళా, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయం ఆవరణలోని శిశువిహార్‌లో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని శిశువిహార్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.వెంకటేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆర్.అశోక్ బుధవారం మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిశువిహార్‌లో పనిచేస్తున్న ఆయాలకు సెప్టెంబరు, అక్టోబరు నెలల వేతనాలు ఇవ్వలేదని, దీంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయాలకు పే స్లిప్పులు ఇవ్వాలని, ప్రతినెలా ఒకటవ తేదీన వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

నీటిపారుదల శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

పంజాగుట్ట, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న ఇంజనీర్లకు పదోన్నతులు ఇచ్చి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్(ఏటీఏఈఈ) రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పదవీవిరమణ చేసిన వారికి పొడిగింపు ఇవ్వొద్దన్నారు. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఎర్రమంజిల్‌లోని జలసౌధలో భోజన విరామ సమయంలో ఎక్స్‌టెన్షన్స్ వద్దు-ప్రమోషన్స్ ముద్దు పేరుతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇంజనీరింగ్ డిపార్టుమెంట్లలోని అన్ని కేడర్ల ఇంజనీర్లు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

భార్యపై దాడి చేసిన రెండో భర్తపై కేసు

బంజారాహిల్స్, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): భార్యను వెంబడించి దాడి చేసిన రెండో భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాజేంద్రనగర్‌లో నివాసముండే రేష్మా బేగంకు 2014లో వివాహం కాగా ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్తతో విడిపోయిన ఆమెకు ఏడాది క్రితం మున్నావర్ హసన్ ఖాన్‌తో పరిచయం ఏర్పడటంతో పెళ్లి చేసుకున్నారు. అయితే ఆమె కుమారులను సరిగా చూసుకోవడం లేదని పిల్లలతో కలిసి టోలీచౌకిలోని తన తల్లి వద్దకు వచ్చింది. ఈ నెల 11న రేష్మాబేగం బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా హసన్ ఆమెపై దాడిచేసి గాయపర్చాడు. ఆ తర్వాత రెండు రోజులకు ఇంటికి వచ్చి మరోసారి దాడిచేశాడు. గాయపడ్డ ఆమె ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తూ యంత్రంలో పడి కార్మికుడి మృతి

జీడిమెట్ల, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు యంత్రంలో పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిహార్ రాష్ట్రానికి చెందిన శివశంకర్ పాశ్వాన్(33) బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి దూలపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. అతడు రామిరెడ్డినగర్ ప్రాంతంలో ఉన్న గోవర్ధన అట్టల కంపెనీలో మెషీన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పనిచేస్తుండగా యంత్రంలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

బంజారాహిల్స్, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. బంజారాహిల్స్‌లోని క్యాంప్ కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మేయర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదింటి ఆడ పిల్లల వివాహానికి ప్రభుత్వం లక్ష రూపాయలు అందిస్తుందన్నారు. అర్హులు పథకాలకు దరఖాస్తు చేసుకుంటే తప్పకుండా లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మేయర్

మేయర్‌పై తప్పుడు ప్రచారం.. వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తి పై క్రిమినల్ కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12 ఎన్‌బీటీనగర్‌కు చెందిన వెంకట్‌రెడ్డి ఇంటి నిర్మాణం చేస్తుండగా జీహెచ్‌ఎంసీ కూల్చివేసింది. ఈ వ్యవహారంపై కె.కేశవరావు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు ఆమె పీఏ రవిపై అవినీతి ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. కేకే, మేయర్ తరఫున వారి ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు వెంకట్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అంబేడ్కర్ వర్సిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు

వర్సిటీ భూములను కాపాడుకుంటాం

- అంబేడ్కర్ వర్సిటీ సైన్స్ విభాగం విద్యార్థులు
- 55వ రోజుకు చేరిన నిరసనలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ భూములను కాపాడుకుంటామని సైన్స్ విభాగ విద్యార్థులు అన్నారు. వర్సిటీలో పది ఎకరాల స్థలాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జె.ఎన్.ఏ.ఎఫ్.ఏ.యూ) కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు బుధవారం సైతం తమ నిరసనను కొనసాగించారు. వర్సిటీ సైన్స్ విద్యార్థులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మల్టీఫంక్షనల్ ల్యాబ్ (ఎస్టీఎంఎల్) భవనం నుంచి పరిపాలన భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.ఎల్.విజయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అంబేడ్కర్ వర్సిటీలో అసలు ఖాళీ స్థలమే లేదని, ప్రభుత్వం విశ్వవిద్యాలయ అధికారులను సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. విద్యార్థులకు కొత్తగా కంప్యూటర్, సైన్స్ ల్యాబ్స్ నిర్మించాల్సిన అవసరముందన్నారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే, నేతలు ప్రొ.పుష్పా చక్రపాణి, డా.రవీంద్రనాథ్ సోలమన్, డా.ప్రమీల కేతావత్, కాంతం ప్రేమ్ కుమార్, డా.అవినాష్, డా.కిషోర్, ఉద్యోగులు, విదార్థులు పాల్గొన్నారు.

బీఎల్‌వోల నియామకానికి సహకరించండి

- ఈఆర్‌వో ప్రశాంతి

ఖైరతాబాద్, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): పోలింగ్ బూత్‌లలో పనిచేసేందుకు బూత్‌స్థాయి అధికారుల నియామకానికి సహకారం అందించాలని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, సర్కిల్ 18 ఉప కమిషనర్ ప్రశాంతి కోరారు. బుధవారం ఖైరతాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఇందులో 9, 10 తేదీల్లో జరిగిన ప్రత్యేక క్యాంపెయినింగ్‌లో వచ్చిన దరఖాస్తుల వివరాలను వెల్లడించారు. బూత్ స్థాయి అధికారుల నియామకం కోసం పేర్లు ఇవ్వాలని కోరారు. ఈఆర్‌వోల పనితీరును, పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసేందుకు ఢిల్లీ నుంచి అధికారులు వచ్చారని, వారితో గురువారం ఈఆర్‌వోల సమావేశం ఉంటుందని ఆమె తెలిపారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఈఆర్‌వో ప్రశాంతి

నేడు బాలల దినోత్సవం


బంజారాహిల్స్‌లో తన కుమార్తెను వీపుపై ఎత్తుకుని పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్తున్న ఓ తండ్రి.. తల్లి చేయిపట్టుకుని నడుస్తున్న బాలుడు

ఫొటో: 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ప్రయాణికుడి మృతికి కారకుడైన వ్యక్తి అరెస్టు చూపుతున్న పోలీసులు

రైలు ప్రయాణికుడి మృతికి కారకుడైన వ్యక్తి అరెస్టు

సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి : రైలులో డోర్ దగ్గర నిలబడి ఉన్న ప్రయాణికుడి మృతుడి కారణమైన వ్యక్తిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. రైల్వే డీఎస్పీ జావీద్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ వివరాల ప్రకారం.. హన్మకొండ ప్రాంతానికి చెందిన చిరుత దినేష్.. ఈనెల 1న వరంగల్ నుంచి సికింద్రాబాద్‌కు శాతవాహన రైలులో డోర్ వద్ద నిలబడి ప్రయాణిస్తుండగా కర్నాటక నడిగుండి చుమిలి గ్రామానికి చెందిన పాత నేరస్థుడు దినేష్ ఫోన్ లాక్కోవడంతో పెనుగులాటలో పట్టాలపై పడిపోయాడు. లాలాగూడ ఏరియాలో రైలు మెల్లగా వెళుతున్న సమయంలో ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు వచ్చి గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ దినేష్ ఈనెల 5న మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో బుధవారం అనుమానస్పదస్థితిలో తిరుగుతున్న నేరస్థుడు లింగప్ప మఫ్టీ పోలీసులకు పట్టుపడ్డాడు. విచారణలో ఈనెల 1న లాలాగూడ ఏరియాలో జరిగిన ఘటన గురించి చెప్పడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితుడు 2018లో ఉడిపి పోలీస్ స్టేషన్ పరిధిలో పలు రాబరీ కేసులలో 7 నెలల పాటు జైలులో శిక్ష అనుభవించి ఇటీవలే బెయిల్‌పై బయటికి వచ్చాడని డీఎస్పీ తెలిపారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై ఉన్న బ్యాగులోని గంజాయి సరుకును స్వాధీనం చేసుకున్నారు. రైల్వే డీఎస్పీ జావీద్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ ప్లాట్‌ఫాం నెంబరు 10లో రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) తనిఖీలు చేస్తుండగా ఓ మూలన బ్యాగు ఉండడం గమనించారు. బ్యాగులో 10.435 కిలోల గంజాయి ఉండడంతో ఆ సరుకును స్వాధీనం చేసుకున్నారు. సరుకు తీసుకొచ్చింది ఎవరో ఇంకా తెలియరాలేదని డీఎస్పీ తెలిపారు. మీడియా సమావేశంలో సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

మేయర్‌పై తప్పుడు ప్రచారం.. వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12 ఎన్‌బీటీనగర్‌కు చెందిన వెంకట్‌రెడ్డి ఇంటి నిర్మాణం చేస్తుండగా జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారు. ఈ వ్యవహారంపై కె.కేశవరావు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు ఆమె పీఏ రవిపై అవినీతి ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. కేకే, మేయర్ తరఫున వారి ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు వెంకట్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

బోయిన్‌పల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోయిన్‌పల్లిలోని శ్రీ వెంకటేశ్వర వేదాంతవర్ధిని సంస్కృత కళాశాలలో క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకుని నిర్వహించిన మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, సుదర్శన హోమం పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళాశాల అభివృద్ధి కోసం లోకకల్యాణం కోసం ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో వచ్చే క్షీరాబ్ధి ద్వాదశికి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు అందరూ కలిసి సామూహికంగా వన సమారాధన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు డాక్టర్ బానోత్ సురేందర్ దంపతులు, హెడ్మాస్టర్ కిషన్ దంపతులు, లంకా సుబ్రహ్మణ్యేశ్వరశర్మ దంపతులు, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, పూర్వ ఆచార్యులు, పూర్వ విద్యార్థులు కాంగ్రెస్ నాయకులు అజయ్ కుమార్, శరత్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



రీసెర్చ్ స్కాలర్‌తో సంభాషిస్తున్న కేంద్రమంత్రి సుకాంత్ మజుందార్, చిత్రంలో వర్సిటీ వీసీ బీజేరావు తదితరులు

పరిశోధనల్లో విద్యావేత్తల కృషి అభినందనీయం

● హెచ్‌సీయూను సందర్శించిన కేంద్రమంత్రి సుకాంత్

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో విద్యావేత్తల కృషి అభినందనీయమని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత్ మజుందార్ అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. కేంద్రమంత్రికి వర్సిటీ వీసీ బీజేరావు, రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు, ఆచార్యులతో కేంద్రమంత్రి సంభాషిస్తూ.. దేశ భవిష్యత్ రూపకల్పన లో నాణ్యమైన విద్య ఆవిష్కరణలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. పరిశోధనల్లో విద్యావేత్తల కృషి, కమ్యూనిటీ ఔట్‌రీచ్‌లో శ్రేష్ఠత ను సాధించడంలో విశ్వవిద్యాలయం పనితీరును ఆయన ప్రశంసించారు. యూనివర్సిటీ విజన్‌కు అనుగుణంగా విద్య నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలపై కూడా మంత్రి చర్చించారు.

లైఫ్ సైన్సెస్ విభాగంలోని యాస్పైర్ బయోనెస్ట్(నాలెడ్జ్ బేస్డ్ ఇంక్యుబేటర్)ను సందర్శించిన మంత్రి అక్కడి స్టార్టప్‌ల అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా క్యాంపస్‌లో ఒక మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చదనం.. కాలనీల్లో ఆహ్లాదం

● సనత్‌నగర్ డివిజన్ జెక్ కాలనీ, మోడల్ కాలనీ, బల్కంపేట తదితర ప్రాంతాల్లో భారీ వృక్షాలు
● రోడ్డుకు ఇరువైపులా చెట్లతో ఆహ్లాదకర వాతావరణం



సనత్‌నగర్ డివిజన్‌లో రోడ్డుకు ఇరువైపులా పచ్చదనంతో చెట్లు

సనత్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు, చెట్ల నీడలో వ్యాయామంతోపాటు రోజువారీ దినచర్యల్లో ఉన్న కాలనీ వాసులు మనకు సనత్‌నగర్‌లో పలు ప్రాంతాల్లో దర్శనమిస్తారు. సనత్‌నగర్ డివిజన్ జెక్ కాలనీ, మోడల్ కాలనీ, సుందర్ నగర్, ఎస్ఆర్‌టీ, బీకేగూడ, ఉదయ్‌నగర్, చాణుక్యనగర్, బల్కంపేట ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలు పచ్చదనాన్ని పంచుతున్నాయి. ఫుట్‌పాత్‌పై ఉన్న భారీ చెట్లు చల్లదనంతోపాటు స్వచ్ఛమైన గాలిని అందిస్తూ కాలనీ వాసులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఆయా కాలనీల్లో నివాసముండేవారు దైనందిన చర్యల్లో పచ్చదనాన్ని, ప్రశాంత వాతావరణాన్ని నిత్యం ఆస్వాదిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద చెట్లు ఉండటంతో వేసవి సమయంలో ఆయా కాలనీల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి చెట్లకింద సేదదీరతారు. ఆయా కాలనీల్లో ఉదయం వ్యాయామం, జాగింగ్, మధ్యాహ్నం విశ్రాంతి, సాయంత్రం పిచ్చాపాటి చర్చలు ఇవన్నీ చెట్ల కిందనే జరుగుతుంటాయనడంలో అతిశయోక్తి లేదు. హరిత హారంలో నాటిన మొక్కలు పెరిగి మనకు నీడను ఆక్సిజన్‌ను ఇస్తాయి. ఇప్పటికే సనత్‌నగర్‌లో పలు కాలనీల్లో పార్కులు ఎక్కువగా ఉన్నాయి. పార్కుల్లో పచ్చదనంతోపాటు రోడ్లపై అధికారులు నాటిన మొక్కలను కాలనీ వాసులు కాపాడుకోవడంతో అవి పెద్ద వృక్షాలుగా మారి చల్లదనాన్ని అందిస్తున్నాయి. కాలనీ వాసులు మొక్కల పెంపకంపై అవగాహన పెంచుతూ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటున్నారు. జెక్ కాలనీ సంక్షేమసంఘం ఇప్పటికే ఓ పార్కును దత్తత తీసుకొని అరుదైన మొక్కలు, వృక్షాలను పెంచుతోంది. ఇలాంటి వాతావరణం పర్యావరణ పరిరక్షణతోపాటు ప్రజల ఆరోగ్యకరమైన జీవనశైలికి తోడ్పడతాయని జెక్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. తాము మొక్కలు నాటడమే కాకుండా వాటిని ట్రీ గార్డులు పెట్టి సంరక్షిస్తున్నామని, వారు తెలిపారు. రాబోయే తరాల వారికి స్వచ్ఛమైన గాలి, చల్లటి నీడను అందించేందుకు తాము ప్రయత్నిస్తున్నామని తెలిపారు. మండు వేసవిలో కూడా చెట్ల కింద పార్క్ చేసిన వాహనాలు చల్లగా ఉంటున్నాయి.

పార్కులతో కళకళ

సనత్‌నగర్ డివిజన్‌లో చిన్నా, పెద్ద పార్కులు చాలా ఉన్నాయి. వాటిలో కొన్నింటిని జీహెచ్‌ఎంసీ నిర్వహిస్తుండగా, మరికొన్ని పార్కులను కాలనీ సంఘాలు నిర్వహిస్తున్నాయి. గతంలో కాలనీ సంఘాల వారు పచ్చదనం కోసం ఖాళీ స్థలాలను పార్కులకు కేటాయించడంతోపాటు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి పరిరక్షించారు. నేడు అవే మొక్కలు పెద్ద వృక్షాలై కాలనీ వాసులకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యాన్ని పంచుతున్నాయి.

శాంతి భద్రతలకు ప్రాధాన్యత

● మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురామ్



రాంగోపాల్‌పేట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇస్తామని పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.పరశురామ్ అన్నారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలపై 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎంత మంది రౌడీ షీటర్లు ఉన్నారు? వారిని ఎలా నియంత్రిస్తున్నారు?

తొమ్మిది మంది రౌడీ షీటర్లు ఉన్నారు. అందులో ఐదుగురు ఇతర రాష్ట్రాల వారు కాగా నలుగురు ఇక్కడి వారు. ఆ ఐదుగురి రౌడీషీట్లను ఆయా పోలీస్ స్టేషన్లకు పంపేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. మిగిలిన నలుగురు రౌడీ షీటర్లను ప్రతిరోజు వారి నడవడికను గమనిస్తూ మానిటరింగ్ చేస్తున్నాం. వారు సాధారణ పౌరులుగా ఉద్యోగాలు చేసుకుంటూ ఉన్నారు.

ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ని దేవాలయాలు, మసీదులు, చిల్లాలు, చర్చీలు ఇతర ప్రార్థనా మందిరాలు ఉన్నాయి?

37 దేవాలయాలు, 4 మసీదులు, 5 చిల్లాలు, ఒక దర్గా ఉన్నాయి. రెండు జైన మందిరాలు ఉండగా చర్చీలు లేవు.

మసీదులలో ఆశ్రయం పొందే వారిపై ఎలాంటి కార్యాచరణ తీసుకుంటున్నారు ?

ఇప్పటి వరకు మసీదులను చెక్ చేయలేదు. కానీ ఇటీవల ముత్యాలమ్మ దేవాలయంపై జరిగిన ఘటనతో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని మసీదుల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశాం. అందులో పాల్గొనే వారి వివరాలు ఇవ్వాలని కోరాం.

పోలీస్ స్టేషన్ పరిధిలో వేగాబండ్స్ (మతిస్థిమితం లేనివారు, రోడ్లపై నివసించేవారు) గురించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మతి స్థిమితం లేనివారు, రోడ్లపై నివసించే వారు 37 మంది ఉన్నారు. వారి వివరాలు సేకరించి వీలైనంత వరకు వారిని వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తాం. అనాథలయితే అనాథాశ్రమాలలో చేరుస్తాం.

ఆర్పీఎఫ్ కుటుంబాల సంక్షేమం కోసం కృషి

● కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్పీఎఫ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దేశ సరిహద్దులో సైనికులు దేశాన్ని కాపాడితే రైలు ప్రయాణికుల రక్షణ కోసం ఆర్పీఎఫ్ పోలీసులు పనిచేస్తున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) పెన్షనర్ల అసోసియేషన్ ప్రత్యేక సమావేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను కూడా ఆర్పీఎఫ్ కుటుంబానికి చెందిన వ్యక్తినేనని, తన తండ్రి ఆర్పీఎఫ్ ఉద్యోగి అని చెప్పుకోవడం గర్వంగా ఉందన్నారు. రైల్వేకు సేవ చేయడం దేశ సేవ చేయడమే నన్నారు. ఆర్పీఎఫ్ అత్యంత కఠినమైన ఉద్యోగమని చిన్ననాటి నుంచి తన జీవితాన్ని ఎంతో ప్రభావితం చేసిందన్నారు. ఫిట్‌నెస్ పట్టుదల క్రమశిక్షణ లాంటి విషయాలు నేర్పించిందన్నారు. పదవీ విరమణ పొందిన ఆర్పీఎఫ్ కుటుంబాల సంక్షేమం కోసం తాను కట్టుబడి ఉన్నానని అవసరమైతే ఢిల్లీకి వెళ్లి రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా చర్చించేందుకు కృషి చేస్తానన్నారు. పార్లమెంట్‌లో ఈ అంశాన్ని లేవనెత్తడానికి ప్రయత్నిస్తానన్నారు. పదవీ విరమణ పొందిన ఆర్పీఎఫ్ ఎస్సైలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫిషరీస్ డైరెక్టర్ దేవేందర్, ఆర్పీఎఫ్ రిటైర్డ్ అసోసియేషన్ అధ్యక్షుడు వరప్రసాద్‌తో పాటు పలువురు విశ్రాంత ఆర్పీఎఫ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తా

చిలకలగూడ.నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైల్వే రక్షణ దళ పింఛన్‌దారుల సమావేశం బుధవారం చిలకలగూడలో సంయుక్త కార్యదర్శి ముత్యాలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీగణేష్ హాజరై మాట్లాడుతూ, రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని, 18 నెలల కరువుభత్యం, పించన్ పెంపు, మెడికల్ అలవెన్స్ రూ.3వేలకి పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ రైల్వేస్ అధ్యక్షుడు రాఘవరావు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ వెల్ఫేర్ అసోసియన్ ప్రధాన కార్యదర్శి రాయుడు పాల్గొన్నారు.

రూ.7.17 కోట్ల డ్రగ్స్ ధ్వంసం

● 2,380కిలోలు బయో-మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్‌లోనే..

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రూ.7.17కోట్ల విలువ చేసే 2,380 కిలోల నార్కోటిక్ డ్రగ్స్‌ను పోలీసులు ధ్వంసం చేశారు. తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సీపీ అవినాష్ మొహంతి పర్యవేక్షణలో సైబరాబాద్ పోలీసుల డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఈ డ్రగ్స్‌ను పూర్తిగా ధ్వంసం చేసింది. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం ఈదులపల్లి గ్రామంలోని జీజే మల్టీక్లేవ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉన్న కామన్ బయో-మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్‌లో డ్రగ్స్ డిస్పోజల్ ఫెసిలిటీ ఉండడంతో అక్కడే చేపట్టారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని 31 పోలీస్‌స్టేషన్ల పరిధిలో బాలానగర్, మాదాపూర్, మేడ్చల్, రాజేంద్రనగర్, శంషాబాద్‌లోని ఐదు జోన్లలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన 155 కేసులలో 2,380 కిలోల నార్కోటిక్ డ్రగ్స్ లభ్యమైంది. ఇందులో గంజాయి 2,286కిలోలు, గంజాయి చాక్లెట్లు 45 కిలోలు, హషీష్ ఆయిల్ 8 లీటర్లు, చరస్ 26కిలోలు, ఆల్ప్రాజోలం 10కిలోలు, నల్లమందు గసగసాలు 1.64 కిలోలు, ఎల్ఎస్‌డీ బ్లాట్స్ 8 యూనిట్లు ఇలా ఎండీఎంఏ, కొకైన్, గంజాయి పొడి, గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. దీన్ని పూర్తిగా ధ్వంసం చేసే ప్రక్రియలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, డీసీపీ క్రైమ్స్ కె. నరసింహ, ఏసీపీ సైబర్ క్రైమ్స్ రవీందర్ రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ కళింగరావు, నార్కోటిక్స్ అదనపు డీసీపీ జి. నర్సింహారెడ్డి వారి బృందం ఉన్నది.

అదుపు తప్పితే అంతే..

● కంకర తేలిన రోడ్లు.. నిత్యం ప్రమాదాలు



గీతా నర్సింగ్‌హోం ముందు కంకర తేలిన ప్రధాన రోడ్డు

అడ్డగుట్ట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట డివిజన్‌లోని అడ్డగుట్ట సీపీఐ పార్టీ కార్యాలయం పక్కన మజీద్ వెనుక వైపు కొన్నేళ్ల క్రితం రోడ్డు పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. అదే విధంగా పార్టీ కార్యాలయం ముందు మట్టి రోడ్డుపై కంకరరాళ్లు తేలడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడ కొంత వరకు రోడ్డు వేసి విడిచిపెట్టిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది పూర్తిగా రోడ్డు వేయకపోవడంతో ప్రమాదాలకు దారి తీస్తోంది. అదే విధంగా మారేడుపల్లి గీతారెడ్డి హస్పిటల్, టిఫిన్ సెంటర్ ముందు గత ఆర్నేళ్ల నుంచి ప్రధాన రోడ్డు పగిలిపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో కొన్నివేల వాహనాలు తిరుగుతున్నప్పటికి ఉదయం సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ మార్గం మీదుగా సికింద్రాబాద్.. అటు పోతే ఏఓసీ సెంటర్, మహేంద్రహిల్స్ సఫిల్‌గూడ వైపు వెళ్లే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా ఈ ప్రాంతాల్లో కొత్త రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణలో ఉన్నత విద్యపై సదస్సు

● టీ-హబ్‌తో ఒప్పందం చేసుకున్న యూఈఎల్



రాయదుర్గంలోని టీ-హబ్ వద్ద కార్యక్రమంలో పాల్గొన్న యూఈఎల్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పాల్ మార్షల్, డైరెక్టర్ గుల్నార్ స్టోవేర్, తదితరులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమ, విద్యారంగం స్పందించాల్సిన తీరుపై చర్చిస్తూ 'పర్యావరణ పరిరక్షణలో ఉన్నత విద్య : పరిశ్రమ, విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం' అంశంపై ఓ కార్యక్రమాన్ని రాయదుర్గంలోని టీ-హబ్ వద్ద బుధవారం నిర్వహించారు. యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ (యూఈఎల్), సిమెన్స్, టీ-హబ్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూఈఎల్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ క్యాంపస్) ప్రొఫెసర్ పాల్ మార్షల్, డైరెక్టర్ గుల్నార్ స్టోవేర్ తదితరులు పాల్గొన్నారు. పరిశ్రమ, విద్యారంగ భాగస్వామ్యాలను నిర్మించడంలో సవాళ్లు, అవకాశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయాలు హరిత ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో తమ పాఠ్యాంశాలను ఎలా సమలేఖనం చేయవచ్చనే అంశాలను చర్చించారు. పర్యావరణ పరిరక్షణ నాయకులను తీర్చిదిద్దడంలో ఉన్నత విద్య పాత్రను వక్తలు ప్రస్తావించారు. దీనిలో భాగంగా సిమెన్స్‌తో యూఈఎల్ ఒప్పందం కూడా చేసుకుంది. యూఈఎల్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పరంగా పరిశ్రమ అనుభవం పొందేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడనుందని పాల్ మార్షల్ అన్నారు. భారతదేశపు ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన చెబుతూ 2030 నాటికి నికర సున్నా ఉద్గారాలను లక్ష్యం తో ముందుకు వెళ్తున్నామన్నారు. సీమెన్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ విభాగం వైస్ ప్రెసిడెంట్ ఫేయ్ బౌసర్ మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల భాగస్వామ్యంతో పర్యావరణ అనుకూలత గురించి తాము విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

కుషాయిగూడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సివిల్ కాంట్రాక్టు పనిలో వచ్చిన నష్టాలకు తోడు, ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా డబ్బులు పోగొట్టుకొని అప్పుల పాలైన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ వివరాల ప్రకారం.. అనిత తన ఇద్దరు కుమారులతో కలిసి మల్లాపూర్, నెహ్రూనగర్‌లో నివసిస్తోంది. తన భర్త ఇటీవల మరణించడంతో సివిల్ కాంట్రాక్టు పనులన్నీ చిన్న కుమారుడు ధనుంజయ్ చూసుకుంటున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి భారీగా నష్టపోయాడు. మంగళవారం అతడు ఇనుప రాడ్డుకు బెడ్‌షీట్‌తో ఉరి వేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో బెదిరించి స్నాచింగ్‌లు : ఇద్దరు మైనర్ల అరెస్టు

●ఐమాక్స్ వద్ద న్యాయవాదిపై దాడి చేసింది వీరే..



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్

మంగళ్‌హాట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఐమాక్స్ వద్ద న్యాయవాది కల్యాణ్‌పై దాడి చేసి మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లిన కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఆబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఆకుల చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు గన్‌ఫౌండ్రిలోని ప్రసాద్ అపార్ట్‌మెంట్ వద్ద వాచ్‌మెన్‌ను ఇద్దరు కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్‌ను లాక్కెళ్లారు. అక్కడి నుంచి వారు వచ్చిన హోండా యాక్టివాపై ఐమాక్స్ వద్దకు వెళ్లారు. అక్కడ వాకింగ్ చేస్తున్న న్యాయవాది కల్యాణ్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను దొంగిలించేందుకు యత్నించారు. ఆయన ప్రతిఘటించడంతో వారి వెంట తెచ్చుకున్న కత్తితో బెదిరించారు. ఈ పెనుగులాటలో న్యాయవాది కల్యాణ్‌కు గాయాలయ్యాయన్నారు. సెంట్రల్ జోన్ పరిధిలో ఇదే తరహాలో రెండు కేసులు నమోదు కావడంతో డీసీపీ నేతృత్వంలో రెండు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా రాంనగర్ చేపల మార్కెట్ వద్ద ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకుని అతడి వద్ద దొంగిలించిన రెడ్‌మీ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిచ్చిన సమాచారం మేరకు చాంద్రాయణగుట్ట బండ్లగూడ వద్ద మరో మైనర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

అతడి వద్ద న్యాయవాది కల్యాణ్ నుంచి దొంగిలించిన మొబైల్ ఫోన్, దాడికి ఉపయోగించిన కత్తి, హోండా యాక్టివాను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారి ఆధార్ కార్డుల ఆధారంగా వారు మైనర్లు అని తేలిందని, వారి వయసును నిర్ధారించేందుకు ఉస్మానియా ఆస్పత్రిలో టెస్ట్‌ల కోసం పంపించామన్నారు. గతంలో వారిపై ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మొబైల్ స్నాచింగ్ కేసు నమోదైందన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించిన అనంతరం కస్టడీకి తీసుకుని విచారిస్తామని ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు.



యూజీసీ ఆడిటోరియంలో 'గెట్ టు గెదర్'లో పాల్గొన్న వర్సిటీ మాజీ ఉద్యోగులు

గెట్ టు గెదర్..!

● సందడి చేసిన జేఎన్‌టీయూ మాజీ ఉద్యోగులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో సుదీర్ఘకాలం పాటు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన పలువురు మాజీ ఉద్యోగులు బుధవారం సమావేశమయ్యారు. వర్సిటీలోని యూజీసీ ఆడిటోరియంలో నిర్వహించిన 'గెట్ టు గెదర్' కార్యక్రమంలో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అటెండరు నుంచి జాయింట్ రిజిస్ట్రార్ వరకు వివిధ హోదాల్లో పనిచేసిన ఉద్యోగులందరూ తారతమ్య బేధాలు మరిచి కాసేపు సందడి చేశారు. ఆపై రిటైర్డు ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించుకున్నారు. పెన్షన్ కోసం లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ, వర్సిటీలో మెడికల్ బిల్లుల పెండింగ్ తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. కార్యక్రమంలో చంద్రశేఖర్, రామశేఖర్, నాగమణి, నాగరాజు, రవికుమార్, సుబ్రమణ్యం, గాయత్రి, ఉషా, పద్మ, వెంకటరెడ్డి, జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.